క్లుప్తంగా

నేడు నాగేంద్రస్వామి దేవస్థానం తిరునాళ్ల



గోలి(రెంటచింతల): మండలంలోని గోలి గ్రామ శివార్లోని అతి పురాతనమైన నాగేంద్రస్వామి దేవస్థానంలో వెలసిన దుర్గామల్లేశ్వరి, నీలంపాటి అమ్మవారు, అభయ ఆంజనేయస్వామి తిరునాళ్ల ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రామరాజు కేశవరావు శనివారం తెలిపారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వార్లకు పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుని అమ్మవారికి పొంగళ్లను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ఈ తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్న వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. రాత్రి 7 గంటలకు తిరునాళ్ల సందర్భంగా కుంకుమబండ్లతో గ్రామోత్సం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు చెప్పారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామ శివార్లోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఏప్రిల్ 21 నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ ఫలితాలు శనివారం విడుదల చేసినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌లో మొత్తం 80 సీట్లకు గాను 70 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని వారిలో 44 మంది మాత్రమే ప్రవేశ పరీక్ష రాయగా వారు మొత్తం అర్హత సాధించినట్లు చెప్పారు. మరో 36 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రెంటచింతల: మండలంలోని పాలువాయిలోని శౌంరిరెడ్డి చిన్న పేరిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు పాఠశాల విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు గోగిరెడ్డి సీతారెడ్డి శనివారం తెలపారు. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆహ్వానితులేనన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పుస్తక పఠనంతో జ్ఞానం.. విజ్ఞానం



రెంటచింతల: పుస్తక పఠనంతో జ్ఞానం.. విజ్ఞానం పెంపొందుతుందని స్థానిక శాఖాగ్రంథాలయ అధికారి రాయపాటి రాజ కిశోర్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు పుస్తక పఠనం వలన కలుగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వలన మన పూర్వీకులతో మాట్లాడిన అనుభూతి కలుగుతుందని, నైతిక విలువలు, క్రమశిక్షణ, సంస్కారం వంటి మంచి లక్షణాలు తెలుస్తాయన్నారు. శిబిరంలో కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పుటం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్, గేమ్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఈ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు డాక్టర్ రామకోటయ్యకు అవార్డు ప్రదానం

మాచర్ల: పట్టణంలోని కేసీపీ ప్రాంగణంలో డాక్టర్ వి.ఎల్.దత్ ఓపెన్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం డాక్టర్ రామకోటయ్య అందించిన విశిష్ట సేవలకు అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, కోశాధికారి లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా రోటరీ క్లబ్ గవర్నర్ కె.ఎస్.చౌదరి హాజరవుతారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపటి నుంచి ఉచిత కరాటే శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ పాఠశాలలో ఈనెల 5వతేది నుంచి జూన్ 5వతేదీ వరకు ఉచిత కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు రొటేరియన్ వనమా పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ నరసరావుపేట ఫీనిక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిబిరంలో ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు కరాటే, జూడో క్రీడల్లో శిక్షణ ఉంటుందని వివరించారు. కరాటే, జూడో సీనియర్ కోచ్ శివరాత్రి శిరీష శిబిరంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. పేర్లు నమోదుకు 8897020595, 9951706583 సంప్రదించాలని తెలిపారు.

వేసవిలో పత్తి సాగుకు శ్రీకారం

- ఆశాజనకంగా సాగు
- ఆసక్తి చూపుతున్న రైతులు



కారెంపూడి పొలంలో మొలకెత్తిన పత్తి



15 రోజుల కిందట వేసిన పత్తి పైరు

కారెంపూడి: పల్నాడు ప్రాంతంలో వేసవి పత్తి సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. గత 15 రోజులుగా పత్తి విత్తనాలు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నిప్పులు కక్కుతున్న భూమి నుంచి పత్తి విత్తనాలు మొక్కలుగా ఎదుగుతున్నాయి. మండుతున్న ఎండలో శ్రమిస్తూ రైతులు పత్తి సాగు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే భూములు పచ్చదనం పరుచుకుంటున్నాయి. గత నెల రెండో వారం నుంచి పత్తి విత్తనాలు వేస్తున్నారు. ప్రస్తుతం ముమ్మరంగా పత్తి విత్తనాలు వేసే పనులు జరుగుతున్నాయి. మే నెలాఖరు వరకు పత్తి విత్తనాలు వేసే అవకాశం కన్పిస్తోంది.

బోర్ల కిందే పత్తిసాగు..

సాగంతా బోర్ల కిందే. రబీలో వరి, కంది, మొక్కజొన్న సాగు చేసిన పొలాలలో వేసవిలో పత్తి సాగు చేపట్టారు. గత 15 ఏళ్లుగా పల్నాట వేసవిలో పత్తి సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది. వేసవిలో చీడపీడల బెడద తక్కువగా ఉండి దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటుండడంతో రైతులు పత్తి సాగును విడవకుండా చేస్తున్నారు. ఎకరాకు 15 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తోంది. ఈ పత్తి అమ్మగా వచ్చిన డబ్బు ఖరీఫ్‌లో పంటల సాగు ఉపయోగపడుతోంది. దీంతో బోరు కింద సేద్యం భూమి ఉన్న రైతులంతా దాదాపు సమ్మర్ కాటన్‌ను సాగు చేస్తున్నారు. దీంతో పాటు వేసవిలో వచ్చిన పత్తి నాణ్యత బాగుండడంతో మంచి ధర కూడా లభిస్తోంది.

సాగు విస్తీర్ణం ఇలా..

పల్నాడులో 15 వేల ఎకరాలలో దాకా ముందస్తు పత్తి సాగు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గురజాల, మాచర్ల నియోజకవర్గాలలోని 9 మండలాలలో కూడా సమ్మర్ కాటన్ సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. కారెంపూడి మండలంలో ముందు వేసిన పత్తిలో అంతర సేద్యం కూడా జరుగుతోంది. ఇంకా పత్తి విత్తనాలు వేస్తున్నారు. మరికొందరు పత్తి వేయడానికి భూమిని సిద్ధం చేస్తున్నారు. విత్తనం మొలిచిన భూములు పచ్చదనం పరుచుకుంటున్నాయి. మొదట భూమిని లోతుగా బొచ్చెలు, నాగళ్లతో దుక్కులు దున్నడం తర్వాత రొటోవీటర్ వేసి గుంటక తోలి భూమిని సాగుకు సిద్ధం చేస్తున్నారు. తర్వాత బోదెలు తోలి బోదోల వెంట పత్తి విత్తనాలు నాటిస్తున్నారు. తర్వాత సాళ్ల వెంట నీరు పెడుతున్నారు. ఇలా పత్తి విత్తనం మొక్కతొడుగుతోంది. మొక్క నాలుగైదు ఆకులు వేయగానే కలుపునివారణ చర్యలు తీసుకుని అంతరసేద్యం, సస్యరక్షణ చర్యలకు శ్రీకారం చుడుతున్నారు.

40 రోజుల్లోనే కాపు దశకు..

పంట 40 రోజుల్లోనే కాపు దశకు చేరుతుంది. జూలై నాటికి పంట మొత్తం ఇంటి చేరే విధంగా చూసుకుంటున్నారు. ఆ తర్వాత మళ్లీ పత్తి పీకిన తర్వాత యథావిధంగా రెండో పంటగా ఖరీఫ్ సాగు చేస్తున్నారు. బీటీ విత్తనాలు వచ్చిన తర్వాత వేసవిలో పత్తి సాగు ముమ్మరంగా జరుగుతోంది. తొలి నాళ్లలో బీటీకి చీడపీడలు లేకుండా పై మందులు పిచికారి చేసే అవకాశం లేకుండా పంట పండింది. కాని బీటీకి ప్రస్తుతం గులాబిరంగు పురుగుతో పాటు అన్ని రకాల చీడపీడలు వస్తున్నాయి. అయితే ఖరీఫ్‌తో పోలిస్తే వేసవి పత్తిలో వీటి ఉధృతి తక్కువగా ఉండడంతో రైతులు వేసవి పత్తి సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

పైరు ఆశాజనకం

నాలుగెకరాలలో పత్తి వేశా. గత నెల 15వ తేదీ పత్తి విత్తనాలు వేయించా. వరి, మొక్కజొన్న పైర్ల సాగు తర్వాత వేశా. ప్రస్తుతం 18 రోజుల పైరు అయింది. ఐదు ఏళ్లుగా వేసవిలో పత్తి సాగు చేస్తున్నా. మొక్కజొన్న తర్వాత సమ్మర్‌కాటన్ సాగే కొంచెం మేలు అనిపిస్తోంది. ప్రస్తుతానికి పైరు ఆశాజనకంగానే ఉంది.

– కొర్రపాటి మురళి, రైతు, కారెంపూడి

మిగులుంటుందనే సాగు చేస్తున్నాం

ఐదెకరాలలో పత్తి సాగు చేస్తున్నా. విత్తనాలు వేశాను. గతంలో ఎంతో కొంత మిగులు రావడంతో విడవకుండా పత్తిని సాగు చేస్తున్నాం. మొక్కజొన్న తర్వాత పత్తి సాగే రైతులకు నయమనిపిస్తోంది. ముందస్తు పత్తి నాణ్యతగా ఉండడంతో పాటు పంట కూడా వెంటనే అమ్ముడుపోతుండడంతో పత్తిని సాగు చేస్తున్నాం.

– బండారు తిరుపతిరావు, రైతు, ఒప్పిచర్ల

మత చాందసానికి వ్యతిరేకంగా యువత పోరాడాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని



ఏఐవైఎఫ్ పతాకం ఆవిష్కరిస్తున్న షేక్ సుభాని, తాళ్లూరి బాబురావు

చిలకలూరిపేట: మత చాందస విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని, తీవ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడుకుందామని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని చెప్పారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావుతో కలసి సీపీఐ కార్యాలయంపై ఏఐవైఎఫ్ పతాకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభవిష్యత్తులో యువత పాత్ర ప్రధానమైనదని, యువతరంలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలను, దేశభక్తి, లౌకిక, ప్రజాస్వామిక ఆలోచనలను పెంపొందించేందుకు ఏఐవైఎఫ్ కృషి చేస్తోందన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ అజాద్, సుభాష్ చంద్రబోస్ వంటి అమరవీరుల వారసత్వం తమదన్నారు. అదే స్ఫూర్తితో అవినీతికి వ్యతిరేకంగా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పోరాడాల్సిన అవసరం నేటి యువతకు ఉందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటంలో పాలకులు విఫలమయ్యాయని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ యాక్ట్‌ను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మల్లిఖార్జున్, రాంబాబునాయక్ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న బూదాటి అనిల్‌కుమార్ (24) తాపీ పనులు నిర్వహిస్తుంటాడు. తల్లి చనిపోవడం, తండ్రి విడిచి వెళ్లడంతో అనిల్‌కుమార్, అతని అన్నయ్య శివరాజేష్ ఇద్దరు 52 ఎకరాల్లోని టిడ్కో గృహాల్లోని మూడో అంతస్తుల్లో అమ్మ మ్మ చింతక్రింది దేవకిదేవి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అనిల్‌కుమార్ ప్రేమించానంటూ ఓ వివాహిత మహిళను ఇంటికి తీసుకురావడంతో మనవడిని తిట్టి ఆమెను విడిచిపెట్టి రమ్మంటూ వాగ్వాదం పెట్టుకుంది. దీంతో సదరు మహిళతో వెళ్లి మరు నాడు శనివారం ఉదయం తిరిగి ఒంటరిగా ఇంటికి వచ్చాడు. ఇంటి సమీపంలో సరుకులు తెచ్చుకునేందుకు వెళ్లిన అమ్మమ్మ వచ్చి తలుపు తీయబోగా లోపల గడియ పెట్టి ఉండటంతో మనవడు వచ్చి ఉంటాడని గ్రహించి ఎన్నిమార్లు పిలిచినా తీయకపోవడంతో అనుమానంతో పొరుగు వారిని పిలిచింది. తలుపు గడియ పగులకొట్టి చూడగా అనిల్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మాలక్ష్మమ్మ అమ్మవారి తిరునాళ్ల



పూజలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు కేతావత్ బాలునాయక్, సర్పంచి పాండునాయక్

వెల్దుర్తి: మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెంలో శనివారం మాలక్ష్మమ్మ అమ్మవారి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి అమ్మవారికి వివిధ రకాల పూజలు నిర్వహించి చివరి రోజు మాలక్ష్మమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు కేతావత్ బాలునాయక్, సర్పంచి పాండునాయక్ అమ్మవారికి తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కుబడులను తీర్చుకొని నైవేద్యాలను సమర్పించారు. భారీ అన్నదానం చేశారు. భక్తులకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపు కేంద్రాలు

మాచర్ల: పురపాలక సంఘం పరిధిలో ప్రత్యేక ఆధార్ క్యాంపు కేంద్రాలు సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ డి.వేణుబాబు శనివారం తెలిపారు. ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు. అక్బర్, రోప్‌వే కాలనీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపు కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ అప్‌డేట్, మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు.

లారీ ఢీకొని వివాహిత మృతి

నకరికల్లు: లారీ ఢీకొని వివాహిత మృతి చెందింది. ఈ ఘటన అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై చల్లగుండ్ల సమీపంలోని గోరంట్ల మేజర్ వద్ద శనివారం జరిగింది. రాజుపాలెం గ్రామానికి చెందిన వీర్ల కల్యాణి (65) మండలంలోని చల్లగుండ్ల గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చింది. గోరంట్ల మేజర్ వద్ద రోడ్డు దాటేందుకు వేచి ఉండగా పిడుగురాళ్ల వైపు నుంచి వస్తున్న సిమెంటు లోడు లారీ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో కల్యాణి లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. కల్యాణి భర్త వీర్ల వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు. ఈ దంపతులకు ముగ్గురు సంతానం ఉన్నారు.

సామాజిక సేవకుడికి పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న గంజి వీరాస్వామి

సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు గంజి వీరాస్వామి 'భారత కీర్తి కిరీటి పురస్కారం' స్వీకరించారు. రెండున్నర దశాబ్దాలుగా సామాజిక సేవ చేస్తున్నందుకు తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సేవా సంస్థ మే 1వ తేదీన విశాఖపట్నంలో ఈ పురస్కారం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు కట్టా శివదుర్గారావు, వంగర మధు, వంగర శ్రీనివాసరావు, అవ్వారు ఏడుకొండలు శనివారం గంజి వీరాస్వామికి అభినందనలు తెలిపారు. ఆయన సేవా నిరతిని ప్రశంసించారు. మున్ముందు ఇలాంటి పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ గౌరవాన్ని అందించిన తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సేవా సంస్థకు వీరాస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

- న్యాయమూర్తి నరేంద్రరెడ్డి
- తిమ్మాపురంలో కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు




మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె. నరేంద్రరెడ్డి

యడ్లపాడు: అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వం కల్పించిన చట్టబద్ధమైన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె. నరేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక వారోత్సవాల సందర్భంగా శనివారం తిమ్మాపురంలోని వసంత నూలుమిల్లులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగించారు. కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని, ప్రతి కార్మికుడూ పనికి తగ్గ వేతనం పొందే హక్కు కలవాడని తెలిపారు. బాల కార్మికుల నియామకం నిషిద్ధమని, దానికి సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలను కూడా వివరిస్తూ, అవగాహన కల్పించారు. అలాగే, కార్మికులకు ప్రభుత్వ పథకాల గురించి వివరించి, మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. చట్ట పరంగా అందుబాటులో ఉన్న అన్ని సేవలను వినియోగించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో చిలకలూరిపేట బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్ ప్రసాద్, న్యాయ వాదులు పి. వెంకటేశ్వరరావు, ఎ.శివరావు, ఏఎస్‌ఐ వెంగయ్య, హెచ్‌ఆర్‌ఎం పుల్లారావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

నరసరావుపేట: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఎ) జిల్లా అధ్యక్షురాలు ఎం.అనుపమ ప్రభుత్వాన్ని కోరారు. తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్కుకు ఎదురుగా గత సోమవారం నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) చేస్తున్న సమ్మె శనివారంతో ఆరో రోజుకు చేరింది. అనుపమ మాట్లాడుతూ జిల్లాలో తాము 361 మందిమి ఆయుష్మాన్ భవన్, రాష్ట్ర వైద్యఆరోగ కుటుంబ సంక్షేమ శాఖల కింద విలేజ్ క్లినిక్స్‌లో సీహెచ్‌వోగా పని చేస్తున్నామన్నారు. తాము పని చేస్తున్న హెల్త్ సెంటర్లను మూసేసి తాము సమ్మెలో పాల్గొంటున్నామన్నారు. ఉపాధ్యక్షులు కె.వినోద్, జిల్లా కో ఆర్డినేటర్ బి.సాగర్, ప్రధాన కార్యదర్శి రాము మాట్లాడుతూ తామందరమూ ఆరేళ్ల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చేస్తున్నామని, నిబంధనల ప్రకారం తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తమకు 23 శాతం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

7న వాసవి అమ్మవారి జన్మదిన వేడుకలు



కొలువుతీరిన వాసవి అమ్మవారు

రెంటచింతల: వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శనివారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రేష్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు అమ్మవారి దేవస్థానంలో లలిత విష్ణు సహస్రనామ పారాయణం, 6.30 గంటలకు పతాక ఆవిష్కరణ, 10 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, 102 మంది మహిళలతో కుంకుమ పూజ నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అమ్మవారి లడ్డు వేలం పాట దేవస్థానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 1 గంటకు తీర్థప్రసాదం, 1.30 గంటలకు భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి కోలాట భజన బృందం మేళతాళాలతో అమ్మవారి పతాకాలను చేబూని కీర్తనలను ఆలపిస్తూ రెంటచింతల గ్రామపురవీధులలో భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

బంగారం చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు వివరాలు వెల్లడి



నిందితుడి అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

దాచేపల్లి: మహిళ ప్రయాణికురాలి నుంచి బంగారం చోరీ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జీఆర్పీ ఎస్‌ఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. నడికుడి రైల్వేస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ తెల్లవారుజామున లింగపల్లి నుంచి కాకినాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు క్రాసింగ్ నిమిత్తం సిరిపురం రైల్వేస్టేషన్‌లో ఆగింది. రైలు బోగిలో ఉన్న ఓ మహిళ ప్రయాణికురాల మెడలో నుంచి బంగారం గొలుసు గుంటూరు శ్యామలనగర్‌కి చెందిన గుర్రప్పాడు రాయప్ప చోరీ చేశాడు. బాధిత ప్రయాణికురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలో తిరుగుతుండగా అరెస్ట్ చేసినట్లు వివరించారు. రైల్వేకోర్టులో నిందితుడిని హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు చెప్పారు. సమావేశంలో ఆర్పీఎఫ్ ఎస్‌ఐ క్రీస్తుదాస్, రైటర్ సరికొండ రామారాజు, కానిస్టేబుల్ కిషోర్ పాల్గొన్నారు.

అంకమ్మ తల్లికి వెండి పద్మపీఠం వితరణ



అమ్మవారికి వెండి పద్మపీఠం అలంకరణ చేసిన దృశ్యం

దాచేపల్లి: స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లికి వెండి పద్మపీఠం శనివారం అలంకరణ చేశారు. నారాయణపురానికి చెందిన అనిశెట్టి శ్రీనివాసరావు దంపతులు రూ.1.50 లక్షల విలువ చేసే వెండి పద్మపీఠం తయారు చేయించారు. ప్రత్యేకంగా పూజలు చేసిన శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి వెండి పద్మపీఠం బహూకరించారు. అమ్మవారి విగ్రహాన్ని వెండి పద్మపీఠంతో అలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు యలమల నరేష్, దాత శ్రీనివాసరావు దంపతులను అభినందించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదుకు డిమాండ్



ఎమ్మార్పీస్ నాయకులతో కలిసి డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న బాధితుడు

అమరావతి: మండల పరిధిలోని లింగాపురంలో మాదిగ కులానికి చెందిన కంభంపాటి విద్యాధర్ కుటుంబంపై దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లాల అధ్యక్షుడు చింతిరాల మీరయ్య డిమాండ్ చేశారు. శనివారం సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావుకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిందితులైన అదే గ్రామానికి చెందిన వారిపై కేసు నమోదు చేయకపోవటం దారుణమన్నారు. ఏప్రిల్ 26వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ కలెక్టర్‌కు దీనిపై అర్జీ ఇచ్చామన్నారు. అడిషనల్ ఎస్పీ సంతోష్‌కు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బాధితుడు విద్యాధర్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు కర్లపూడి ప్రశాంత్, నూనె బాబురావు, కలకోటి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఈత, స్కేటింగ్ వసతులు



స్కేటింగ్ కోర్టును ప్రారంభిస్తున్న దరువూరి నాగేశ్వరరావు

సత్తెనపల్లి: ఈత, స్కేటింగ్ వసతులు సత్తెనపల్లిలో అందుబాటులోకి రావడం సంతోషదాయకమని డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆర్‌కే స్కేటింగ్ కోర్టును శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సెలవులలో విద్యార్థులకు అటవిడుపుగా క్రీడలు దోహద పడతాయన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తు చేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండానే స్థానికంగా అందరికీ అందుబాటులో వసతులు రావడంతో ఎక్కువమంది నేర్చుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక యువత, విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కేటింగ్ ఇన్‌చార్జి ఖాజా, పూల్‌ప్లాజా నిర్వాహకులు చంద్రశేఖర్, విజయ్, చందు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పని ప్రదేశాలలో ప్రథమ చికిత్స కిట్లు ఉంచాలి



కూలీలతో మాట్లాడుతున్న రవికుమార్

అచ్చంపేట: ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో తప్పనిసరిగా ప్రథమ చికిత్స కిట్స్, తాగు నీళ్లు, షేడ్ నెట్స్ అందుబాటులో ఉంచాలని పల్నాడు జిల్లా కార్మిక సంఘం కార్యదర్శి గంజిమాల రవికుమార్ తెలిపారు. మండలంలోని చెరుకుంపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలను సంఘాలుగా రిజిస్ట్రేషన్ చేసి మేస్త్రీలకు ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలన్నారు. తీసిన ఫొటోలు గ్రూపుల వారికి అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి పనికి వర్క్ ఐడీ ఇవ్వాలని, అన్ని పనులకు ఒకే వర్క్ ఐడీ ఇవ్వడం వల్ల కూలీలు నష్టపోతారని చెప్పారు. ప్రతి కూలీకి 150 రోజులు పని చూపించాలని, రోజువారీ వేతనం ప్రతి ఒక్కరికి రూ.350కు తగ్గకుండా ఇవ్వాలన్నారు. మేట్లకు ప్రత్యేక అలెవెన్స్‌లు కేటాయించాలన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రావెళ్ల వెంకటేశ్వర్లు, ఉపాధి పథకం మేట్లు పాల్గొన్నారు.